బాలమిత్ర, జి. రామలక్ష్మి - హైదరాబాదు

## త్రివేణి సంగమం

బాబాకి చాలామంది భక్తులు ఉన్నారు అందులో 'దాసుగణు' అనే అతను కూడా వుండేవాడు! ఇతడు పాటలు చక్కగా పాడతాడు. బాబాపైన చక్కని కీర్తనలు, హరికథలు చెపుతాడు. అతడంటే సాయిబాబాకి చాలా ఇష్టం. తన లీలలను, మహిమలను అతి శ్రావ్యంగా పాటకట్టి పాడతాడు. తనయందు నిర్మలమైన భక్తిని చూపిస్తాడు. అతనిది అదంతా పూర్వజన్మ సుకృతం అటుంటారు ఎప్పుడూ అందరితో.

ఒకరోజు దాసుగణూ బాబా వద్దకు వచ్చి, "బాబా నాకు 'త్రివేణీసంగమం' దర్శించాలని ఉంది. గంగా, యమున, సరస్వతి నదుల సంగమమైన త్రివేణి సంగమం చాలా పవిత్రమైనది అంటారు. నాకు ఆ జలంలో జకలమాడి రావాలని ఉంది. మీరు అనుమతి ఇస్తే, యిదిగో ఈ బృందం అందరితో కల్సివెళ్ళొస్తాను" అని అడిగాడు.

ఆ బృందం కాక, అప్పటికే బాబా చుట్టూ చాలామంది భక్తులు చేరివున్నారు. అప్పుడు బాబా, దాసుగణూతో "త్రివేణీసంగమ స్నానం కోసం అంత దూరం ప్రయాణమై వెళ్ళవలెనా? నాతో చెప్తే నేను నీ కోరిక తీర్చనా!" అన్నారు ప్రశ్నార్థకంగా.

అందులకు దాసుగణు "బాబా! మీరు మా కోర్కెలు అన్నీ తీర్చగలరని తెలుసు. కానీ నా కోరిక అసాధ్యమైనది. గంగ, యమున, సరస్వతి లాంటి పెద్ద నదులు కలిసిన త్రివేణీ సంగమం ఇక్కడికి ఎలా తీసుకకురాగలరు! కామట్టి ఈ భక్తులతో కలిసి త్రివేణీ సంగమం చేరాలన్న కోరిక కలిగింది. అందులకు మీ అనుమతి కావాలి" అన్నాడు.

"దాసుగణూ! నీ కోరిక తీర్చనని ఎలా అనుకుంటున్నావు. త్రివేణీ సంగమం చూడడానికి అంత దూరం ఎందుకు వెళ్ళడం. ఇక్కడే మా అందరితో కలిసి త్రివేయీ సంగమం చూస్తూ, అందులో స్నానం చేయి. నా భక్తుల కోరిక తీర్చడానికే నేను వున్నాను" అంటూ వేపచెట్టు క్రింద ఉన్న గట్టుమీద కూర్చుని, కాళ్ళు ముందుకు చాపి, తన రెండుకాళ్ళ బొటనవ్రేళ్ళ నుంచి గంగాజలాలను విలువసాగారు. ఆ జలాలు మూడు రంగులతో మూడు రకాలుగా త్రివేణి జలం ఉరకలు వేస్తూ రాగా అందరూ ఆశ్చర్యపోయారు. బాబాని స్తుతిస్తూ, కీర్తిస్తూ, బాబా ఆజ్ఞతో ఆ జలాలలో అందరూ కేరింతలు కొడుతూ జలకాలాడారు. ఒక చిన్న వాగులా, కాలువగా, ప్రవాహంలా

తయారయిన ఆ నీరు మూడు రంగులతో సూర్యరశ్మి కాంతిలో శోభిల్లుతూ తళతళ మెరుస్తూంటే భక్తుల ఆనందాశ్చార్యాలకు అవధులు లేవు.

బాలలూ! భగవంతునికి భక్తులు ఎప్పుడూ చేరువే! అందుకే భక్తుడనిపించుకున్నాక భగవంతుడ్ని ఏ కోరికలు కోరుకున్నా సునాయాసంగా అయిపోతాయనటానికి ఇదొక నిదర్శనము కాదా! బాబా భక్తులపాటి కల్పవృక్షము వంటి వారు సుమా! అందుకే గంగా జలాలను సహితం భక్తుని వద్దకే తెప్పించారు.